క్లుప్తంగా

సజావుగా నీట్



పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలేంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజ్‌లో ఆదివారం నిర్వహించిన నీట్ –2024 ఆన్‌లైన్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 720 మందికి గాను 702 మంది హాజరయ్యారు. ప్రత్యేక పరిశీలకులు పర్యవేక్షించారు.

మిలీనియం మహనీయుడు కార్ల్‌మార్క్స్



పాల్గొన్న యూటీఎఫ్, జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు

శ్రీకాకుళం: మిలీనియం మహనీయుడు కార్ల్‌మార్క్స్ అని జనవిజ్ఞాన వేదిక, యూటీఎఫ్ ప్రతినిధులు పొందూరు అప్పారావు, బొడ్డేపల్లి మోహనరావు, గొంటి మురళీధర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ భవనంలో జనవిజ్ఞాన వేదిక, యూటీఎఫ్ ఆధ్వర్యంలో కార్ల్‌మార్క్స్ జయంతి నిర్వహించారు. శ్రామిక జీవుల పక్షాన నిలిచిన గొప్ప యోధుడు కార్ల్‌మార్క్స్ అని కొనియాడారు. ప్రపంచ కార్మికులను ఏకం చేసిన గొప్ప వ్యక్తి అని గుర్తు చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు రెడ్డి మోహనరావు, సంపతిరావు కిషోర్‌కుమార్, బమ్మిడి శ్రీరామమూర్తి, కుప్పిలి కామేశ్వరరావు, బొడ్డేపల్లి జనార్దనరావు, సామ సంజీవరావు, గొంటి గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటాక్ చిత్రలేఖన పోటీల విజేతగా కావ్య



శ్రీకాకుళం కల్చరల్: జాతీయ స్థాయి ఇంటాక్ చిత్రలేఖనం పోటీలలో పి.కావ్య ప్రాంతీయ విజేతగా నిలిచిందని ఇంటాక్ కన్వీనర్ ఎస్.సన్యాసిరావు, అడిషనల్ కన్వీనర్ వి.జగన్నాథంనాయుడు తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇంటాక్ న్యూఢిల్లీ నిర్వహించిన మై మాన్యుమెంట్స్ సెర్చ్ చిత్రలేఖన పోటీల్లో ఇంటాక్ శ్రీకాకుళం చాప్టర్ ప్రాంతీయ అవార్డు గెలుచుకోవడం ఆనందంగా ఉందన్నారు. మొత్తం 101 ఇంటాక్ చాప్టర్లు పాల్గొనగా న్యూసెంట్రల్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని పి.కావ్య చారిత్రక శ్రీముఖలింగం ఆలయాన్ని చిత్రీకరించి విజేతగా నిలిచింది. విద్యార్థినితో పాటు ఎన్‌సీఎస్ డైరెక్టర్ పి.శ్రీకాంత్‌ను కో కన్వీనర్ నటుకుల మోహన్, ఇంటాక్ సభ్యులు ఆదివారం అభినందించారు.


ఘనంగా 'తెరవే' సాహితీ సమ్మేళనం



కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని శాంతినికేతన్ జూనియర్ కళాశాలలో తెలుగు రచయితల వేదిక (తెరవే) ఆధ్వర్యంలో ఆదివారం 92వ నెలవారీ సాహితీ సమ్మేళనం నిర్వహించారు. సంస్థ అధ్యక్షులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి ఆర్.వి.రమణమూర్తి ఆధ్వర్యంలో కవులు సామాజిక పరమైన కవితలు చదివారు. కార్యక్రమంలో కవులు ఐఎన్‌డీ ప్రసాద్, ఎం.శ్రీనివాసరావు, ఇద్ది పాపయ్య, తోట గోపాలరావు, నిక్కు హరిసత్యనారాయణ, భోగిల ఉమామహేశ్వరరావు, తంగి ఎర్రమ్మ, పి.లక్ష్మీనారాయణ ఎం.ఉపేంద్రశర్మ, బి.జగన్నాథరావు, కె.బి.రవికిరణ్, బి.మోహన్‌గాంధీ, ఎస్.ఈశ్వరరావు పాల్గొన్నారు.

కేంద్ర బలగాల కవాతు



కవాతు నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: కిష్టప్పపేట, సింగుపురం పరిధిలోని గ్రామాల్లో ఆదివారం కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. ఎన్నికల నేపథ్యంలో ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరక్కుండా గ్రామస్తులను చైతన్యం చేస్తున్నామని రూరల్ ఎస్ఐ వాసుదేవరావు తెలిపారు.

10 నుంచి నీలమణిదుర్గ ఉత్సవాలు

పాతపట్నం: ఈ నెల 10 నుంచి 18వ తేదీ వరకు ఉత్తరాంధ్ర ఇలవేల్పు పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారి 49వ వార్షిక నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ చైర్మన్ నూలు ఈశ్వరరావు, ఈఓ వాసుదేవరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజులుగా ఆలయానికి రంగులు వేస్తున్నారు. తొమ్మిది రోజులపాటు అమ్మవారి ఆయలంలో హోమాలు, కుంకుమ, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

మబగాంలో ఉన్నతి పథకంలో భాగంగా ఆటోను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్(ఫైల్)



ఉన్నతిమైన ఆశయం

- ఎస్సీ, ఎస్టీ మహిళల జీవనోపాధికి ఆటోల మంజూరు
- నున్నా వడ్డీకే రుణాలు..సులభ వాయిదాల్లో చెల్లింపులు



నరసన్నపేట:

స్వయం సహాయక సంఘాల గ్రూపుల్లో ఉన్న ఎస్సీ, ఎస్టీ మహిళల జీవనోపాధి పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఉన్నతి' పథకం సత్ఫలితాలనిస్తోంది. అర్హులైన మహిళలు ఆటోలు కొనుగోలు చేస్తూ ఉపాధి పొందేందుకు వీలుగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా వడ్డీ లేని రుణాలు అందిస్తోంది. ఇప్పటికే జిల్లాలో 13 మందికి రుణాలు మంజూరు చేసి ఆటోలు సైతం పంపిణీ చేసింది.

వడ్డీలేని రుణాలు..

మహిళల ఆర్థికాభ్యున్నతే లక్ష్యంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఈ పథకం ద్వారా వడ్డీ లేని రుణాలు మంజూరు చేశారు. ఆటో కొనుగోలుకు అయ్యే ఖర్చులో లబ్ధిదారులు కేవలం 10 శాతం మాత్రమే చెల్లిస్తే సరిపోతుంది. మిగిలిన 90 శాతం రుణాన్ని సెర్ప్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుంది. ఈ రుణానికి ఎలాంటి వడ్డీ ఉండదు. మొత్తం రుణం 48 సులభ వాయిదాల్లో చెల్లించే సౌకర్యం కల్పించారు. డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న మహిళలకు మాత్రమే ఈ పథకానికి అర్హులు.

తొలి విడతగా 13 మందికి..

జిల్లా వ్యాప్తంగా దరఖాస్తులు ఆహ్వానించగా అర్హులుగా 13 మందిని ఎంపిక చేశారు. ఈ మేరకు రుణాలు మంజూరు చేసి ఆటోలు కొనుగోలు చేయించి అప్పటి కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌తో ప్రారంభించారు. పోలాకి, జలుమూరు మండలాల్లో ఆటోలు పొందిన లబ్ధిదారులు ఆటోలను నడుపుతూ ఉపాధి పొందుతున్నారు. ఆమదాలవలస, సారవకోట, ఎచ్చెర్ల, జలుమూరు, పోలాకి, శ్రీకాకుళం, టెక్కలి, పలాస, రణస్థలం, ఎల్ఎన్‌పేట, మెళియాపుట్టి మండలాల్లో ఒక్కొక్కరికి చొప్పున ఉన్నతి పథకంలో ఆటోలు అందజేశారు.

కుటుంబానికి అండగా..



నాలాంటి పేద ఎస్సీ మహిళకు వడ్డీ లేని రుణంతో ఆటో ఇచ్చి ఆదుకున్నారు. ఆటో బాగా నడుపుతున్నాను. ఆదాయం కూడా బాగుంది. సకాలంలో రుణం చెల్లించి ప్రభుత్వ ఆశయాన్ని నెరవేరుస్తా.

– ఇప్పిలి దుర్గ, జలుమూరు

కుటుంబానికి దన్నుగా..



ఆటో కొనుగోలుకు రుణం ఇచ్చి ఆదుకున్నారు. చాలా ఆనందంగా ఉంది. నా కుటుంబాన్ని బాగా పోషించుకోగలననే ధైర్యం కలుగుతుంది. అధికారులు, ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటాను.

– కళింగపట్నం రవళి, బద్రి, సారవకోట మండలం

సద్వినియోగం చేసుకున్నా..



'ఉన్నతి' పథకం నాలాంటి మహిళలకు ఎంతగానో ఉపకరించింది. సాధారణంగా ఎస్సీ కుటుంబాలు ఒక ఆటో కొనుగోలు చేయాలంటే ఎంతో కష్టం. అలాంటిది వడ్డీ లేకుండా ప్రభుత్వం సెర్ప్ సహకారంతో రుణం చెల్లించి ఆటోలు కొనుగోలు చేసి ఆదుకుంది.

– కోతి రాణిపోలమ్మ, చీడివలస, పోలాకి మండలం

జీవనాధారం..



జగనన్న ప్రభుత్వం ఆటోను వడ్డీలేని రుణంతో మంజూరు చేసి ఆదుకుంది. కుటుంబ పోషణకు వీలు కలిగింది. నేనూ, సమయం ఉన్నప్పుడు మా ఆయన ఆటో తీస్తున్నాం. ఆదాయం ఆశాజనకంగా ఉంది. జగనన్న మేలు మరిచిపోలేం.

– బానాల ఆరుద్ర, మోదుగువలస, ఎల్ఎన్‌పేట మండలం

బూటకపు హామీలు నమ్మవద్దు



శ్రీకాకుళం రూరల్: ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

- వైఎస్సార్ సీపీతోనే సంక్షేమం
- ఎన్నికల ప్రచారంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్ : సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు మతిలేని మాటలు ఆడుతున్నారని, ఆయన హామీలను నమ్మవద్దని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. రూరల్ మండల పరిధిలోని కరజాడ, బైరి, పాత్రునివలస, సింగుపురం గ్రామాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక గడిచిన 75 ఏళ్లుగా చాలా నిర్లక్ష్యానికి గురైన కుటుంబాల జీవన ప్రమాణాలు పెరిగాయన్నారు. కరోనా కష్టకాలంలోనూ ఎన్నో కార్యక్రమాలు అమలు చేసి ప్రజలు మన్ననలు పొందామని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే విశాఖ రాజధానిగా పాలన సాగుతుందని, న్యాయ, శాసన రాజధానులు కర్నూలు, అమరావతిలో ఉంటాయని స్పష్టం చేశారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రజల చెంతకు సేవలు తీసుకురావడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా 2లక్షల 50వేలు మందికి ఉద్యోగాలు ఇచ్చామని వివరించారు. చంద్రబాబు సూపర్‌సిక్స్ మేనిఫెస్టో పేరిట కొత్త డ్రామాలకు తెరతీశారని, అవన్నీ బూటకపు హామీలేనన్నారు. గతంలో ఇంటికో ఉద్యోగం, రైతు, డ్వాక్రా సంఘాలకు రుణమాఫీ చెప్పి మోసం చేశారని గుర్తు చేశారు. అబద్ధపు హామీలు నమ్మి పొరపాటున అధికారం కట్టబెడితే రాష్ట్రం రావణకాష్టంగా మారుతుందన్నారు. ప్రభుత్వాలనేవి ప్రజల జీవితాల్లో వెలుగులు తీసుకొచ్చేలా ఉండాలన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి భూములు తీసుకున్నవారైతే రాష్ట్రంలో 31 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు రూ.12,800 కోట్లు ఖర్చుపెట్టి భూములను కొనుగోలు చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గార: వైఎస్సార్ సీపీతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని మంత్రి ధర్మాన కోడలు సుశ్రీ అన్నారు. ఆదివారం పూసర్లపాడు పంచాయతీలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి పట్ల అవగాహన ఉన్న నేత ధర్మాన ప్రసాదరావును మళ్లీ గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మార్పు సుజాతమ్మ, వైస్ ఎంపీపీ అరవల రామకృష్ణ, ముంజేటి కృష్ణమూర్తి, గోరు అనిత, పీస శ్రీహరిరావు, సీజు తదితరులు పాల్గొన్నారు.



గార: పూసర్లపాడులో ప్రచారం నిర్వహిస్తున్న ధర్మాన సుశ్రీ



శ్రీకాకుళం రూరల్: ప్రచార ర్యాలీలో పాల్గొన్న పార్టీ నాయకులు

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత మంత్రి ధర్మాన ప్రసాదరావును మళ్లీ గెలిపించాలని ఆయన సతీమణి ధర్మాన గజలక్ష్మి కోరారు. సింగుపురం పంచాయతీలో ఆదివారం వైఎస్సార్ సీపీ తరఫున ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం : రాష్ట్ర కొప్పుల వెలమ సంక్షేమ సంఘం డైరెక్టర్ వాసిరెడ్డి అనురాధ ఆదివారం కరజాడ, నరసన్నపేటలో వైఎస్సార్ సీపీ తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం జగన్ సంక్షేమ పాలన కొనసాగేలా అన్ని వర్గాల వారు మద్దతు తెలపాలని కోరారు.



శ్రీకాకుళం రూరల్: సింగుపురంలో ప్రచారం నిర్వహించిన ధర్మాన గజలక్ష్మి



శ్రీకాకుళం: కరజాడలో ప్రసంగిస్తున్న వెలమ సంక్షేమ సంఘం డైరెక్టర్ అనురాధ

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం



ఎచ్చెర్ల: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అఖండ మెజారిటీ సాధించేందుకు నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం లావేరులో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో జగనన్నను ముఖ్యమంత్రిగా, ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. సమావేశంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రణస్థలం: సంక్షేమం, అభివృద్ధే వైఎస్సార్‌సీపీ అజెండాగా పాలన సాగిందని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి గురాన మానస అన్నారు. మండలంలోని వల్లభరావుపేట పంచాయతీలో ఆదివారం వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సీఎం జగన్మోహన్ రెడ్డి పాలనలో జరిగిన మంచిని ప్రతి ఇంటికి వివరించి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మహంతి సత్యనారాయణ, గడి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: ఇబ్రహింబాద్ గ్రామంలో ఆదివారం వైఎస్సార్ సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు సనపల నారాయణరావు, నాయకులు సీపాన ఎర్రన్నాయుడు, సూర అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జి.సిగడాం: మండలంలోని కొయ్యానపేట, వెంకయ్యపేట, జాడ, దేవరవలస గ్రామాల్లో ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దేవరవలసలో జిల్లా సెంట్రల్ బ్యాంకు మాజీ డైరెక్టర్ తిరుమరెడ్డి గౌరీశంకరరావు, ఎంపీటీసీ తిరుమరెడ్డి లక్ష్మణరావు కలిసి ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ఎమ్మెల్యేగా కిరణ్, ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను మళ్లీ గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తిరుమరెడ్డి రమణమ్మ, జక్కంపూడి రమణ, నారాయణరావు, దాస్ పాల్గొన్నారు.



రణస్థలం: వల్లభరావుపేటలో ఇంటింటా ప్రచారంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు



జి.సిగడాం:దేవరవలసలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



ఎచ్చెర్ల క్యాంపస్: ఇబ్రహింబాద్‌లో వైఎస్సార్ సీపీ నాయకుల ఎన్నికల ప్రచారం

సుదర్శన క్రియతో బహుళ ప్రయోజనాలు



అభ్యాసకులతో డాక్టర్ అమ్మన్నాయుడు

శ్రీకాకుళం కల్చరల్: యోగా, ధ్యానం, సుదర్శన క్రియల వల్ల ఏకాగ్రత, ప్రశాంతత వంటి బహుళ ప్రయోజనాలు కలుగుతాయని ఏఓఎల్ యోగా టీచర్ డాక్టర్ కె.అమ్మన్నాయుడు అన్నారు. పెద్దపాడు రోడ్డులోని ఆర్ట్ ఆఫ్ లివింగ్ కేంద్రంలో వ్యవస్థాపకులు రవిశంకర్ గురూజీ జన్మదిన వేడుకల్లో భాగంగా ఆదివారం గ్లోబల్ హేపీనెస్ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దేసూళ సురేంద్ర అభ్యాసకులతో సుదర్శన క్రియను సాధన చేయించారు. కార్యక్రమంలో వలంటీర్లు శ్రీనివాసరెడ్డి, కాత్యాయని, రాజేష్, గొండు అప్పారావు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన



పుస్తకాలు చదువుతున్న చిన్నారులు

ఎచ్చెర్ల క్యాంపస్: ధర్మవరం గ్రంథాలయంలో ఆదివారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మల్లిపెద్ది చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవుల్లో గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొనసాగుతున్న పోస్టల్ బ్యాలెట్ పోలింగ్



ఎచ్చెర్ల ప్రభుత్వ పాఠశాలలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఉద్యోగులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల నియోజకవర్గానికి సంబంధించి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. ఎన్నికలు విధుల్లో పాల్గొనే ఎచ్చెర్ల నియోజకవర్గ ప్రభుత్వ ఉద్యోగులు విభాగాల వారీగా పోలింగ్‌లో పాల్గొంటున్నారు. ఎచ్చెర్ల పోలీస్ క్వార్టర్స్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రారంభమైన ఓటింగ్ 7వ తేదీ వరకు కొనసాగనుంది. రెండు రోజుల్లో 1481 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆదివారం 851 మంది ఓటు వేశారు. పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పోలింగ్ సరళి పరిశీలించారు.



పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కిరణ్

గేయ సుధాబిందువులు పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు

శ్రీకాకుళం కల్చరల్:

నగరంలోని ఉపనిషన్మందిరంలో 'గేయ సుధాబిందువులు' పుస్తక పరిచయ కార్యక్రమం ఆదివారం జరిగింది. రచయిత నిక్కు అప్పన కవితా శైలిని పలువురు వక్తలు ప్రశంసించారు. ముందుగా భాస్కరభట్ల శ్రీరామశర్మ పుస్తకంలోని అంశాలను ప్రస్తావించారు. కార్యక్రమంలో జంధ్యాల శరత్‌బాబు, బలివాడ మల్లేశ్వరరావు, రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, నిష్టల నర్సింహమూర్తి, వి.కామేశ్వరరావు, కె.తవుడు, ఎం.శ్రీనివాసరావు, ఎంఏఎన్ భట్లు, నరసింగరావు, సరస్వతి, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.